క్లుప్తంగా

మొక్కలు నాటి కాపాడాలి



జఫర్‌గఢ్ : ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పోల్ రాజు కోరారు. కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో 'మేరీ మట్టి మేరీ దేశ్' ప్రోగ్రాంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు.

ఎన్నిక



దేవరుప్పుల : తెలంగాణ రాష్ట్ర మెడికల్ హెల్త్ అవుట్ సోర్సింగ్ కాంట్రాక్టు ఎంప్లాయీస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా అప్పిరెడ్డిపల్లెకు చెందిన గడ్డం రాజ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశారు.

కేసీఆర్‌ను కలిసిన 'పల్లా'



జనగామ : గజ్వేల్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్‌ను గురువారం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

'మోదీ సర్కారు ఖాయం'

బచ్చన్నపేట : కేంద్రంలో ముచ్చటగా మూడోసారి మోదీ సర్కారు రావడం ఖాయమని బీజేపీ భువనగిరి జిల్లా మాజీ అధ్యక్షుడు పీవీ. శ్యామ్‌సుందర్ రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని ఆయన కోరారు. మండల అధ్యక్షులు సద్ది సోమిరెడ్డి, మల్లేష్, ధనుంజయ్, వెంకట్‌రెడ్డి, మహేష్, రాజు, నాగేష్, జలేందర్, బాలరాజు, సాంబయ్య, మహేందర్‌రెడ్డి, చంద్రమౌళి, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

గుండెపోటుతో వెటర్నరీ ఏడీ మృతి



చంద్రమౌళి(ఫైల్)

కొడకండ్ల : మండల కేంద్రంలోని పశు వైద్యశాలలో ఏడీగా పనిచేస్తున్న డాక్టర్ సి.చంద్రమౌళి గుండెపోటుతో బుధవారం రాత్రి మృతి చెందాడు. ఏడీగా సేవలందిస్తూ అందరితో అప్యాయంగా పలకరించే ఆయన ఆకస్మిక మృతిపట్ల స్థానికంగా విషాదం నెలకొంది. ఏడీ మృతి పట్ల కాంగ్రెస్ అధ్యక్షుడు మండల ధరావత్ సురేష్‌నాయక్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్ నాయక్ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

వ్యక్తికి తీవ్రగాయాలు

జనగామ రూరల్ : బైక్ అదుపు తప్పి కిందపడగా ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన బుధవారం రాత్రి వడ్లకొండ–శామీర్‌పేట రోడ్డులో చోటుచేసుకుంది. నర్మెట మండలం గండిరామారం గ్రామానికి చెందిన జాల నవీన్ తన తల్లిని హైదరాబాద్ వెళ్లేందుకు బస్సు ఎక్కించేందుకు బైక్‌పై తీసుకొచ్చి తిరుగు పయనమయ్యాడు. కాగా బైక్‌పై వడ్లకొండ–శామీర్‌పేట రోడ్డులో వెళ్తుండగా అదుపు తప్పి కింద పడడంతో తీవ్రగాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌కు తరలించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

జనగామ రూరల్ : మండలంలోని చీటకోడూర్ డ్యాం తూము గేట్ల వద్ద గురువారం సుమారుగా 45 సంవత్సరాల వయస్సు గల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. తెల్లటి గడ్డంతో దుస్తులు లేకుండా ఉన్నాడని సీఐ శ్రీనివాస్ తెలిపారు. మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై అరుణ్ తెలిపారు.

బెల్ట్‌షాపులపై దాడి

స్టేషన్‌ఘన్‌పూర్ / చిల్పూరు : మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పోకల లక్ష్మీనర్సయ్య, కన్నెబోయిన శ్రీశైలం బెల్ట్‌షాపులను నిర్వహిస్తూ అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సై నాగరాజు ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి రూ.57వేల విలువైన మద్యాన్ని పట్టుకున్నారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో ఎవరైన బెల్టు షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని చిల్పూరు ఎస్సై వినయ్‌కుమార్ తెలిపారు.

'పది' విద్యార్థులకు టాలెంట్ టెస్ట్



జఫర్‌గఢ్ విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు



బచ్చన్నపేట : విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న నోడల్ ఆఫీసర్ మూర్తి



లింగాలఘణపురంలో..



కొడకండ్ల: పరిశీలిస్తున్న ఎంఎన్‌ఓ గ్రేస్‌కేజియారాణి

పాలకుర్తి టౌన్ : తెలంగాణ సోషల్ ఫోరం మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం పదోతరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్రంలో టాలెంట్ టెస్టు నిర్వహించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు పోటీలు నిర్వహించారు. బల్లుల ఉప్పలయ్య, పాషా, రంగాచారి, సుమతి, కేదారేశ్వర్ పాల్గొన్నారు.

10జీపీఏ విద్యార్థులకు ప్రోత్సాహకం

లింగాలఘణపురం : మండలంలోని పదో తరగతి చదువుతున్న విద్యార్థులు 10/10జీపీఏ సాధించిన వారికి రూ.10వేల ప్రోత్సాహక బహుమతి ఇవ్వనున్నట్లు తహసీల్దార్ వినయలత తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఫోరం ఆధ్వర్యంలో మండల స్థాయి టాలెంట్ టెస్టును నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి తహసీల్దార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. టాలెంట్ టెస్టు నిర్వహించడం అభినందనీయమని, సమాజంలోని అన్ని విషయాలు తెలుస్తాయని, వ్యక్తి సంపూర్ణ వికాసానికి దోహదపడుతుందని అన్నారు. మండల స్థాయిలో తెలుగు విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిన విద్యార్థులు బి.లోకేశ్, పి.రూప, బి.నవ్య, ఇంగ్లిష్ మీడియంలో ఆర్,స్నేహ, వి.భయ్యా, ఎస్, హర్షిత, పీవీఆర్ నుంచి ఎస్.కార్తీక్, బి.నిఖిల్, కె.శ్రీఖర్‌లు ఉన్నారు. వీరంతా ఈ నెల 3న జిల్లాస్థాయిలో జరిగే టాలెంట్ టెస్టులో పాల్గొంటారు. ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

బంగారు భవిష్యత్‌కు కష్టపడాలి

బచ్చన్నపేట : విద్యార్థులు తమ బంగారు భవిష్యత్‌కు కష్టపడి చదవాలని మండల నోడల్ అధికారి డీవీఎల్ఎన్ మూర్తి అన్నారు. గురువారం మండల కేంద్రంలో మండల స్థాయి సాంఘిక శాస్త్ర టాలెంట్ టెస్ట్ నిర్వహించారు.

మండలస్థాయి సోషల్ టాలెంట్ టెస్ట్

జఫర్‌గఢ్ : టీఎస్ఎస్‌టీఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక మోడల్ స్కూల్‌లో మండల స్థాయి సోషల్ టాలెంట్ టెస్టును గురువారం నిర్వహించారు. ఈపోటీలకు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కిరణ్‌కుమార్, జానీనాయక్, వెంకట్, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొడకండ్ల : తెలంగాణ సోషల్ స్టడీస్ ఫోరం ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు మండల స్థాయి టాలెంట్ టెస్ట్‌ను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల నోడల్ ఆఫీసర్ గ్రేస్‌కేజియా రాణి, ఫోరం బాధ్యులు విజయ్‌కుమార్, వెంకటాద్రి, జక్కుల ప్రభాకర్, స్వప్న, సీఆర్పీలు జ్ఞానానందం, బాలాజీ, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులకు అందుబాటులో ఉండాలి

బచ్చన్నపేట : ప్రత్యేకాధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని స్థానిక సమస్యలను పరిష్కరించాలని మండల ప్రత్యేకాధికారి ఇస్మాయిల్ అన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో గ్రామాల ప్రత్యేక అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో సర్పంచ్‌ల వద్ద చార్జ్ తీసుకొని గ్రామస్తులకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విశాలాక్షి, ఎంపీడీఓ రఘురామకృష్ణ, పీఆర్ ఏఈ శ్రీనివాస్‌రావు, జీపీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దేవరుప్పుల : రాజకీయాలకతీతంగా గ్రామ పంచాయతీల ప్రత్యేకాధికారులు పారదర్శకంగా పాలన చేయాలని ఎంపీపీ బస్వ సావిత్రి సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వడ్డెపల్లి ఉమామహేశ్వర్ అధ్యక్షతన ప్రత్యేక అధికారుల పాలనలో విధుల తీరుపై పలు శాఖల అధికారులు, కార్యదర్శులకు సమావేశం నిర్వహించారు. ఎంపీఓ టి.సురేష్‌కుమార్, కార్యాలయ సిబ్బంది రవీందర్, మల్లీశ్వర్ పాల్గొన్నారు.

పట్టభద్రులకు అవగాహన

రఘునాథపల్లి : మండలంలోని ఖిలాషాపూర్, రఘునాథపల్లిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో గురువారం పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుపై ప్రచారం చేశారు. అర్హులైన యువత వద్దకు చేరుకొని దరఖాస్తులు అందజేసి ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోళ్ల రవిగౌడ్, సర్పంచ్ ఎండీ హయతలీ,మేకల నరేందర్, గాదె మహేందర్‌రెడ్డి, పేర్ని రవి, ఇబ్రహీంపాషా, రంగు రాజు పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి

పాలకుర్తి : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటరుగా నమోదు చేయించుకోవాలని బీఎస్పీ నాయకులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తాలో ఓటు నమోదు వివరాలు సేకరించేందుకు ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జనగామ జిల్లా అధ్యక్షుడు రాపాక శ్రీశైలం, నాయకులు చిలుమల కృష్ణ, భాస్కర్, ప్రవీన్, కోతి సుధాకర్, చెరిపెల్లి కుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అందని ఉచిత దుస్తులు

జనగామ రూరల్: విద్యాసంవత్సరం పూర్తి కావస్తున్న జిల్లాలో విద్యార్థులకు ఇంత వరకు ఉచిత దుస్తులు అందించని అధికారులపై చర్య తీసుకోవాలని డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి అన్నారు. గురువారం జిల్లా అధ్యక్షుడు ఇప్ప రాంరెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఏ ఒక్క మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ఉచిత దుస్తులు అందించకపోవడం దారుణమన్నారు. దుస్తువులు కుట్టించడంలో అక్రమాలు పాల్పడిన వారిపై ఫిర్యాదు చేసినా ఇంత వరకు విచారణ చేపట్టలేదని చెప్పారు. ఎస్‌సీఆర్టీ నిబంధనలకు విరుద్ధంగా డిప్యూటేషన్‌లో కొనసాగుతున్న ఉపాధ్యాయులను ప్రభుత్వ పాఠశాలలకు పంపించడం హర్షనీయమని, అనధికారికంగా కొనసాగుతున్న వారిని బోధనలో పాల్గొనేలా చూడాలన్నారు.

ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేయాలి

● ఏఐసీసీటీయూ రాష్ట్ర కన్వీనర్ రాజు



ఆటో యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న రాజు

నర్మెట : రాష్ట్రంలో ఆటో, క్యాబ్ యూనియన్ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని ఆల్ ఇండియా సెంట్రల్ కౌన్సిల్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ రొయ్యల రాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బెడదం సుధాకర్ అధ్యక్షతన గురువారం ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో 20లక్షల మంది ఆటో, క్యాబ్ కార్మికులుండగా వారిపై ఆధారపడి మరో 50 లక్షల మంది జీవనం సాగిస్తున్నారని, వారికి ఎలాంటి భద్రత లేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఆటో కార్మికులకు భరోసా కల్పిస్తూ రూ.5 వేల కోట్లతో ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటుతోపాటు0 ప్రతీ కార్మికుడికి నెలకు రూ.25 వేలు చెల్లించాలన్నారు. అలాగే రూ.10 లక్షల బీమా సౌకర్యం, ఆటో ఫిట్‌నెస్ రద్దుచేయడంతో పాటు కార్మికుల పిల్లలకు ఉచిత విద్య అందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బోయిని లింగమూర్తి, గోపగోని రవి గౌడ్, పులి రాజు, రఘు, శ్రీకాంత్, జోగయ్య, కరుణాకర్, గట్టుమల్లు, అంజనేయులు, రాజేష్, నరేష్, దేవేందర్, రాకేష్, చంద్రకాంతం తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పాలకవర్గాలకు వీడ్కోలు



చిల్పూరు: సర్పంచ్,ఉప సర్పంచ్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లోని పలు గ్రామ పంచాయతీల పాలకవర్గాలకు గురువారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం వారిని శాలువాలతో సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. పదవీకాలం ముగిసిన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులను ఎంపీపీ, వైస్ ఎంపీపీ, స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ కార్యదర్శులు, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు.

– సాక్షి నెట్‌వర్క్



కొడకండ్ల : గిర్నితండా పాలకవర్గాన్ని సన్మానించిన ఎంపీపీ జ్యోతి తదితరులు



తరిగొప్పుల: సర్పంచ్, వార్డు సభ్యులను సత్కరించిన వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ



రఘునాథపల్లి: శివకుమార్‌ను సత్కరిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



బచ్చన్నపేట: బండనాగారంలో సర్పంచ్ కవితను సన్మానిస్తున్న వార్డు సభ్యులు, గ్రామస్తులు



రఘునాథపల్లి: లక్ష్మీతండా సర్పంచ్ పయ్యావుల లావణ్య దంపతులను సత్కరిస్తున్న గ్రామస్తులు



జఫర్‌గఢ్: తిమ్మంపేట పంచాయతీ పాలకవర్గం



స్టేషన్‌ఘన్‌పూర్: సన్మానం పొందిన సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు



దేవరుప్పుల: లక్ష్మణ్‌తండా సర్పంచ్ వీరేషన్‌ను సన్మానిస్తున్న స్థానికులు



రఘునాథపల్లి: సన్మానం పొందిన సర్పంచ్ శివకుమార్, వార్డు సభ్యులు



దేవరుప్పుల: ధర్మాపురంలో పాలకవర్గానికి జ్ఞాపికలు అందజేస్తున్న స్థానిక నాయకులు

బస్‌షెల్టర్ మంజూరు హర్షణీయం



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్ : మండలంలోని ఛాగల్లు గ్రామానికి బస్‌షెల్టర్ మంజూరు కావడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ జిల్లా నాయకుడు గద్దె అనిల్‌కుమార్ అన్నారు. కాగా ఛాగల్లులో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇందిర ఫ్లెక్సీలకు గురువారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఛాగల్లులో బస్‌షెల్టర్ లేక ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన ఇందిర, సీఎం రేవంత్‌రెడ్డి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారని అన్నారు. ప్రజా సమస్యలపై తక్షణమే స్పందించి కాంగ్రెస్ ప్రభుత్వం రూ.8లక్షలు మంజూరు చేసిందని, ఇందుకుగాను సీఎంకు, ఇందిరకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ద్వారానే ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ నాగరబోయిన శ్రీరాములు, పార్టీ మండల అధ్యక్షుడు జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల కారుణ్య నియామకాలు చేపట్టాలి

దేవరుప్పుల / బచ్చన్నపేట / కొడకండ్ల : వీఆర్‌ఎల కారుణ్య నియామకాలు సత్వరమే చేపట్టాలని వీఆర్‌ఎల వారసత్వ సంఘం జిల్లా అధ్యక్షుడు చింత శివ డిమాండ్ చేశారు. జీఓ 81, 85 ప్రకారం 61 ఏళ్లు పైబడిన వీఆర్‌ఎల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ గురువారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో వారసత్వంగా 20,555 మందికి ఉద్యోగ నియామకాల జీఓ జారీ చేస్తే అందులో 3,797 మందికి కోర్టు స్టే కారణంగా నియామకం చేపట్టలేదన్నారు. దీంతో గడిచిన రెండు నెలల్లో 14 మంది మృతి చెందడంతోపాటు వేతనం లేక కుటుంబాల పరిస్థితి దయనీయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత డిసెంబర్ 11న హైకోర్టు డివిజన్ బెంచ్ ఉత్తర్వుల మేరకు 81, 85 జీఓలపై ఉన్న స్టే ఎత్తివేసినందున అర్హతను బట్టి ఉద్యోగ నియామకాలు చేపట్టి ఆదుకోవాలని కోరారు. కాగా ఆయా మండల తహసీల్ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేశారు. గురువారం పలు సమస్యలతో కూడిన వినతి పత్రాలను బచ్చన్నపేట తహసీల్దార్ విశాలాక్షి, కొడకండ్ల తహసీల్దార్ అంజయ్యకు అందజేశారు.

సంక్షిప్త సమాచారం

పోస్టర్ ఆవిష్కరణ

జనగామ రూరల్/ దేవరుప్పుల / లింగాలఘణపురం : ఫిబ్రవరి 11,12, తేదీల్లో ఖమ్మంలో జరిగే రాష్ట్ర విద్యా వైజ్ఞానిక ద్వితీయ మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి. శ్రీనివాస్, టీపీటీఎఫ్ దేవరుప్పుల మండల అధ్యక్షుడు ఎం.లక్ష్మణ్‌జీ , టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వజ్రయ్య, జిల్లా కార్యదర్శి ఉప్పల శ్రీహరి అన్నారు. గురువారం జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మయ్య అధ్యక్షతన డీఈఓ రాము వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

రామాలయాన్ని సందర్శించిన స్థపతి ప్రసాద్

చిల్పూరు : మండలంలోని నష్కల్‌లోని కాకతీయుల కాలంలో నిర్మించిన రామాలయాన్ని గురువారం స్థపతి ప్రసాద్ సందర్శించారు.. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రామాలయం అభివృద్ధికి మాస్టార్ ప్లాన్ వేయాలంటూ దేవాదాయ శాఖ వారు ఆదేశించారని అందులో భాగంగానే ఆలయానికి వచ్చినట్లు తెలిపారు.

కాంగ్రెస్ గ్రామకమిటీల ఎన్నిక

తరిగొప్పుల : మండలంలోని అబ్దుల్‌నాగారం, మాన్‌సింగ్‌తండా గ్రామాల్లో గురువారం గ్రామ, యూత్, మహిళా కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కావటి సుధాకర్, లకావత్ రవి , యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పండుగ సంపత్, లకావత్ ప్రశాంత్, మహిళా అధ్యక్షురాలిగా బండి రజిత, జ్యోతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

23వ వార్డు కాంగ్రెస్ కమిటీ ఎన్నిక

జనగామ రూరల్ : డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని 23వార్డులో కాంగ్రెస్ కమిటీని స్థానిక బీరప్ప గుడి ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భూష పర్వతాలు, ప్రధానకార్యదర్శిగా ఎండి గౌస్, మహిళా అధ్యక్షురాలుగా కేమిడి రేణుక, ప్రధాన కార్యదర్శిగా ఎండి ఫర్వీన్ ఎన్నికయ్యారు.

నియామకం

దేవరుప్పుల : నెహ్రూ యువకేంద్ర సంఘటన్(ఎన్‌వైకేఎస్) వరంగల్ జిల్లా అడ్వైజర్ కమిటీ సభ్యుడిగా పెద్దమడూరుకు చెందిన బీజేపీ జిల్లా నాయకుడు పెద్దగొని రాజును నియమించినట్లు కేంద్ర ప్రభుత్వ యూత్,స్పోర్ట్స్ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ ఉత్తర్వు జారీ చేశారు.

ఉపాధిహామీని వినియోగించుకోవాలి

బచ్చన్నపేట: గ్రామాల్లో జాబ్ కార్డు కలిగి ఉన్న వారు ఉపాధిహామీ పథకం పనులను వినియోగించుకోవాలని ఎంపీడీఓ రఘురామకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని సాల్వాపూర్‌లో గ్రామస్తులతో అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

సన్మానం

కొడకండ్ల : మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థి బోదాసు రాజును గురువారం పాఠశాల అధ్యాపకులు సన్మానించారు. మోడల్‌స్కూల్‌లో విద్యనభ్యసించిన రాజు నర్సింగ్ ఆఫీసర్‌గా ఎంపిక కావడంతో ప్రిన్సిపాల్ సునీతతో పాటు అధ్యాపకులు సన్మానించారు.

రైతు సభ్యత్వ నమోదు

నర్మెట : భారతీయ కిసాన్‌సంఘ్ మండల శాఖ అధ్యక్షుడు తాండ్ర వీరారెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురువారం రైతు సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీలు వేరైనా రైతులంతా ఒక్కటేనని ప్రతీ రైతు సభ్యుడిగా తమ పేరును విధిగా నమోదు చేసుకోవాలన్నారు.

చర్య తీసుకోవాలి

జనగామ : పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు గెజిటెడ్ అధికారితో సంతకం చేసిన దరఖాస్తు అందిస్తే జనగామ తహసీల్ కార్యాలయ నాయబ్ తహసీల్దార్ తిరస్కరించారని ప్రముఖ న్యాయవాది శ్రీరాం శ్రీనివాస్ అన్నారు. గెజిటెడ్ అధికారి సంతకం చేసిన కాపీలను పరిశీలనలోకి తీసుకోవాలనే నిబంధన ఉన్నా, నిర్లక్ష్యం ప్రదర్శించారని, నాయబ్ తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జఫర్‌గఢ్ : హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలు, పోలీస్‌స్టేషన్, గ్రామపంచాయితీల వద్ద నూతన సంవత్సర క్యాలెండర్లను గురువారం ఆవిష్కరించారు. తహసీల్దార్ అంజనేయులు, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కార్యదర్శి రాజేశ్వర్ ఆవిష్కరించారు.

ఇబ్బందులు తొలగించాలి

పాలకుర్తి : మండలంలోని సాంఘిక సంక్షేమ పాఠశాలలో ప్రహరీ కూలిపోవడంతో కుక్కలు ఆవరణలోకి వచ్చి విద్యార్థినులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయని యువజన కాంగ్రెస్ నాయకులు గురువారం అన్నారు. వాటినుంచి ఇబ్బందులను తొలగించాలని కామారపు సునిల్, ఆకుల నాగరాజు, గాంధారి శ్రీనివాస్ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని కలసిన నాయకులు

తరిగొప్పుల: టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. భువనగిరి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీలో నిలిచేందుకు నామినేషన్ దాఖలు చేయగా శాలువాతో సన్మానించారు.

సంక్షేమ పథకాలపై కళాజాతా

తరిగొప్పుల : రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో గురువారం మండలంలోని కొత్తతండాలో కళాజాతా నిర్వహించారు. కళాజాతా బృందం సభ్యులు గడిపె బాలయ్య, గద్దర్ సాంబయ్య, తిప్పర్తి శ్రీనివాస్, బావండ్లపల్లి చిరంజీవి, ముక్కెర సంపత్‌కుమార్, ఎడవెల్లి విజయ పాల్గొన్నారు.

బియ్యం అందజేత

తరిగొప్పుల : మండలంలోని అక్కరాజుపల్లికి చెందిన చింతల పోషయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు.కాగా బాధిత కుటుంబానికి రెయిన్‌బో యూత్ సభ్యులు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా 25 కేజీల బియ్యం,5 కేజీల వంటనూనె అందజేశారు.

క్రీడల్లో రాణించాలి

బచ్చన్నపేట : యువత క్రీడల్లో రాణించాలని మండలంలోని కొడవటూర్ సర్పంచ్ గంగం సతీష్‌రెడ్డి అన్నారు. కాగా గురువారం గ్రామంలోని యువకులకు క్రీడాసామగ్రిని అందజేశారు.

క్రికెట్ పోటీలకు సహకారం అందిస్తా

చిల్పూరు : మారేపల్లిగూడెం క్రికెట్ యూత్ ఆధ్వర్యంలో ఈనెల 4వతేదీన నిర్వహించే క్రికెట్ పోటీల ఏర్పాటుకు సహాయ సహకారాలను అందిస్తానని పొట్లపల్లి శ్రీధర్‌రావు అన్నారు. మండలంలోని పల్లగుట్ట గ్రామ పంచాయతీ పరిధిలోని మారేపల్లిగూడెం యంగ్‌స్టార్ యూత్ సభ్యులు గురువారం శ్రీధర్‌రావును కలిశారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నర్మెట : మండలంలోని వెల్దండకు చెందిన కాసర్ల లచ్చమ్మ ఇటీవల మృతిచెందింది. కాగా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గంగం నర్సింహారెడ్డి గురువారం పార్టీశ్రేణులతో కలసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు.

కాంగ్రెస్ నాయకుల పరామర్శ

జఫర్‌గఢ్ : జఫర్‌గఢ్‌కు చెందిన ఠాకుర్ అనిల్‌కుమార్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మంచాల ఎల్లయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అన్నెబోయిన భిక్షపతి, మాజీ ఎంపీపీ మనోజ్‌రెడ్డి పార్టీ బృందంతో కలసి బాధిత కుటుంబాన్ని గురువారం పరామర్శించారు.

ఆర్థికసాయం

బచ్చన్నపేట : మండలంలోని పోచన్నపేటకు చెందిన కంద్రాజు వినోద ఇటీవల మృతిచెందింది. కాగా గురువారం బాధిత కుటుంబ సభ్యులకు నాయకులు, సామాజిక కర్త పోతుల రాములు యాదవ్ రూ. 5వేల ఆర్థికసాయాన్ని అందించారు.